## క్లుప్తంగా

### కొండలమ్మ సన్నిధిలో భక్తుల కోలాహలం



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి అత్యధిక మంది భక్తులతో ఆదివారం కోలాహలంగా మారింది. భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూల్లో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

### 592 మందికి వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆదివారం ఉచితంగా కార్పొరేట్ వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 592 మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, గుండె, ఊపిరి తిత్తులు తదితర సంబంధ వ్యాధులకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, డాక్టర్ భవాని, నేత్ర వైద్యానికి విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ హనుమకొండ దుర్గాభవాని, మానసిక రుగ్మతలకు హైదరాబాదుకు చెందిన డాక్టర్ హరిహర్ తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

### పంచాయతీ కార్యదర్శులకు స్థాన చలనం

మొవ్వ: మండలంలోని కూచిపూడి, నిడుమోలు పంచాయతీలకు కార్యదర్శి(ఎఫ్ఏసీ)గా మంత్రి పాలెం గ్రామపంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి ఈవీ హనుమాన్ గౌడ్‌ను, మొవ్వ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సోమేశ్వరరావును పెదముత్తేవి కార్యదర్శి (ఎఫ్ఏసీ)గా నియమించారు. కాజ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి రాంబాబును అయ్యంకి పంచాయతీ కార్యదర్శి(ఎఫ్ఏసీ)గాను పెదసనగల్లు రెగ్యులర్ పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శిగా, పెదపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి (ఎఫ్ఏసీ) గా కూడా కొనసాగుతున్న ప్రభుకుమార్‌ను భట్లపెనుమర్రు పంచాయతీ కార్యదర్శి (ఎఫ్ఏసీ)గా నియమిస్తూ ఉయ్యూరు డీఎల్‌పీ సంపత్ కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

### ఘనంగా గంగానమ్మ జాతర



భట్లపెనుమర్రు(మొవ్వ): మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామ శివారు మల్లికార్జునపురంలో గ్రామదేవత గంగానమ్మ వార్షిక సంబరాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాల విన్యాసాల నడుమ 108 జలబిందలతో అమ్మవారికి అభిషేకాలు చేసి అలంకరించారు. ఈ సందర్భంగా పోతురాజు గడ, ఘటంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి ముందు స్వాగతం పలికి హారతులతో నీరాజనాలు అర్పించారు. అనంతరం తమ మొక్కులను చెల్లించుకున్నారు.

### అన్నదానం



కైకలూరు: స్థానిక వెలంపేట ఎయిమ్ ఫర్ సేవా అనాథశ్రమంలో చిన్నారులకు వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పి.అనిల్‌కుమార్ ఆదివారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆయన కుమార్తె మేఘన పుట్టిన రోజును పురస్కరించుకుని ఆశ్రమంలో చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

# స్మార్ట్‌గా షాక్



- వ్యాపార విద్యుత్ వినియోగదారులకు అత్యధిక బిల్లుల బెడద
- గుడ్లవల్లేరు మండలంలో 17,500 విద్యుత్ కనెక్షన్లు



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు (ఫైల్)

గుడ్లవల్లేరు: కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లతో వాణిజ్య వ్యాపార వినియోగదారులకు నెల నెలా రెట్టింపుగా పెంచేసిన విద్యుత్ బిల్లులతో షాకులపై షాక్‌లను ఇస్తోంది. స్మార్ట్ మీటర్లను బిగించాక ప్రతి నెలా వాడుతున్న విద్యుత్ వినియోగంలో తేడా లేకపోయినా ఎందుకు రెట్టింపుగా పెరుగుతున్నాయో వినియోగదారులకు అర్థం కావడం లేదు. అడ్డగోలుగా వస్తున్న విద్యుత్ బిల్లులతో వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. ఒక నెల రూ.5 వేలు బిల్లు వస్తే.. మరొక నెల రూ.9వేలకు పైగా వస్తున్న బిల్లులతో అవి కట్టలేక అప్పుల పాలవుతున్నారు.

### రాబోయే కాలంలో ప్రీపెయిడ్ కనెక్షన్లు

గుడ్లవల్లేరు మండలంలో 17,500 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో 1,250 స్మార్ట్ మీటర్లు ఉన్నాయి. అన్ని కనెక్షన్లు దశల వారీగా రాబోయే కాలంలో ప్రీపెయిడ్ కనెక్షన్లుగా మారనున్నాయి. విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసింది మొదలు నెల నెలా బిల్లులను పెంచేస్తున్నారు. ఆ బిల్లులతో అవి చెల్లించలేక వ్యాపారులు గుడ్లు తేలేస్తున్నారు. ఈ స్మార్ట్ మీటర్లు తమ కొంప ముంచుతున్నాయని వ్యాపార వినియోగదారులు వాపోతున్నారు. వ్యాపారుల పరిస్థితే ఇలా ఉంటే.. రాబోయే రోజుల్లో ఇక ఇళ్లు, రైతుల మోటార్లకు ఇదే స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఇక వారి సంగతి ఏమిటో ఆలోచించుకోవాల్సిందే.

### కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు

ఇకపై రీచార్జి పరిమితి ముగిసిన వెంటనే సరఫరా నిలిపివేస్తామనే ప్రభుత్వ ప్రచారం అన్ని వర్గాల వినియోగదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే వినియోగదారుల తరపున పోరుబాట పట్టిన కమ్యూనిస్టు నేతల నుంచి ఈ స్మార్ట్ మీటర్ల వినియోగంపై కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు అన్ని ప్రాంతాల్లో వెల్లువెత్తుతున్నాయి. స్మార్ట్ మీటర్లు ఏర్పాటైన తరువాత డబ్బులు ముందుగా (ప్రీ పెయిడ్) చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా అవుతుందన్న ప్రచారంతో వినియోగదారులు బెంబేలెత్తిపోయారు.

### కేంద్ర మార్గదర్శకాల మేరకు..

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా స్మార్ట్ మీటర్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. త్వరలో అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లను అమర్చేందుకు నిర్ణయం తీసుకుంది. ముందస్తుగా ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఫ్యాక్టరీలు, వ్యాపారులకు ఈ మీటర్లను బిగించింది. రానున్న రోజుల్లో అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లను అమర్చే లక్ష్యంతో అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది.

### అడ్డగోలు బిల్లులతో అప్పుల పాలు



అడ్డగోలుగా వస్తున్న విద్యుత్ బిల్లులతో అప్పుల పాలు అవుతున్నాం. ఈ స్మార్ట్ మీటర్లు వచ్చాకే ప్రతి నెలా బిల్లులు రెట్టింపుగా వస్తున్నాయి. అదేమంటే అధికారులు, సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. ఒక నెల రూ.5వేల పైబడి వస్తే.. మరొక నెల రూ.9వేల పైబడి బిల్లు వస్తోంది. మరొక నెల రూ.25వేలకు పైగా పెరిగిపోతుంటే బిల్లులు కట్టేది ఎలా?

– చిట్టూరి సూర్యనారాయణ, పిండిమర నిర్వాహకుడు, గుడ్లవల్లేరు

### వ్యాపారులకు ఇబ్బందులు



స్మార్ట్ మీటర్ల వలన వ్యాపారులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఒక నెల బిల్లుతో పోలిస్తే.. మరొక నెల బిల్లును అధికంగా పెంచేస్తున్నారు. ప్రతి నెలా వాడే విద్యుత్ వాడకంలో తేడా లేకపోయినా.. ఎందుకు బిల్లులను నెల నెలా పెంచేస్తున్నారో అర్థం కావటం లేదు. ప్రస్తుతం బిల్లులను పాత పద్ధతిలోనే చెల్లించబట్టి ఇబ్బందులు లేకపోయాయి. రీచార్జ్ పద్ధతి అయితే ఇంకా మరిన్ని ఇబ్బందులు తప్పవు.

– వి.రాజా, వస్త్ర దుకాణ యజమాని, గుడ్లవల్లేరు

### స్మార్ట్ మీటర్లు వద్దంటూ సంతకాల సేకరణ



మూలలంకలో సంతకాలు సేకరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

కలిదిండి(కైకలూరు): విద్యుత్ రంగాన్ని ప్రైవేటు వ్యక్తుల పరం చేసే అదానీ స్మార్ట్ మీటర్లను బిగించొద్దని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ ఆదివారం జరిగింది. మూలలంక, భాస్కర్ రావుపేట గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు మాట్లాడుతూ కూటమి పార్టీ అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామని చెప్పి ఈ రోజున ప్రజలపై మరిన్ని విద్యుత్ భారాలు మోపుతున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలుగొట్టండి అని చెప్పిన వారు ఈ రోజున అవే స్మార్ట్ మీటర్లను బిగించి విద్యుత్ రంగాన్ని పూర్తిగా అదానీ చేతిలో పెట్టి ప్రజలను దోచుకోవడమేనన్నారు. ఈ నెల 5వ తేదీన కరెంటు చార్జీలు తగ్గించాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని నిలుపుదల చేయాలని మండల కేంద్రాల్లో జరిగే నిరసనను విజయవంతం చేయాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు వి.భాస్కరరావు, డీవీ.సత్యనారాయణ, ఎస్.మహాలక్ష్మీ, ఎస్ఎన్‌వీ. సత్యనారాయణ, జి.అనిల్‌కుమార్, సీహెచ్.సత్యనారాయణ, జోగి ఏసు, కడగాని రమేష్ పాల్గొన్నారు.

## అదనపు భారం వేయడం తగదు

పూరి గుడిసెకు విద్యుత్ బిల్లు రూ.691



జూలై కరెంట్ బిల్లు



రూ.691 విద్యుత్ బిల్లు వచ్చిన పూరి గుడిసె

మొవ్వ: కూటమి ప్రభుత్వం విద్యుత్ నియంత్రణ మండలి నష్టాల పేరుతో అదనపు భారాలు మోపడం దారుణమని ప్రజావేదిక నాయకులు పేర్కొన్నారు. 'మొవ్వలో విద్యుత్ చార్జీల ధరలు తగ్గించాలి, స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలి' అంటూ ఆదివారం చేపట్టిన సంతకాల సేకరణలో కార్యక్రమంలో భాగంగా సర్వన్నపాలెం రోడ్డులోని జొన్నలగడ్డ సుబ్బారావుకు చెందిన పూరి గుడిసెకు రూ.691 విద్యుత్ బిల్లు రావటాన్ని నాయకులు ఖండించారు. జూలై బిల్లు అసలు రూ.471, అదనపు చార్జీలు, సుంకాలు సుమారు రూ.220 మొత్తం రూ.691 కట్టాల్సి వచ్చిందని తెలిపారు. ఇందులో 2022 2023 2024 2025 (మే నెల) సంబంధించి సర్దుబాటు చార్జీల పేరుతో అదనంగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. పేదలపై ఈ విద్యుత్ బాదుడు ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు, సీఐటీయూ నాయకులు కాకి రాజశేఖర్, చిగురుపల్లి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు.

## అంకితభావంతో పనిచేస్తే గౌరవం

వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్



ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాసరావు దంపతులను సత్కరించిన డీఎన్నార్, నాయకులు

కైకలూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసే ఉద్యోగులు అన్ని చోట్ల గౌరవం పొందుతారని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఆటపాక మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎంగా ఉద్యోగ విరమణ చేసిన కిలారి శ్రీనివాసరావు దంపతులకు భుజబలపట్నంలో అభినందన సభ ఆదివారం జరిగింది. డీఎన్నార్ మాట్లాడుతూ 1989లో దయ్యంపాడులో ఉపాధ్యాయుడిగా ప్రవేశించిన శ్రీనివాసరావు వేలాది మంది విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వేశారన్నారు. అనంతరం శ్రీనివాసరావు, శ్రీలక్ష్మీ దంపతులను సన్మానించారు. సహచర ఉపాధ్యాయుడు పి.చిట్టిబాబు రచనతో తయారు చేసిన ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.రామారావు, విశ్రాంత ఎంఈఓ సువర్ణరాజు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకుడు నున్న శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు గాలిబ్‌బాబు, ముదునూరి రవిరాజు, సమయం అంజి, త్రినాథరాజు పాల్గొన్నారు.

## దుమ్ము రేగుతోంది!

దుమ్ము మయంగా మొవ్వ–కూచిపూడి రోడ్డు



బస్సు వెళ్తుంటే వెనుక రేగిన దుమ్ము

మొవ్వ: మొవ్వ నుంచి నాట్య క్షేత్రం కూచిపూడి వెళ్లే రహదారి దుమ్ము మయంగా మారింది. మొన్నటి వరకు పెద్ద గుంతల మయంగా ఉన్న ఈ రహదారిని ఎట్టకేలకు అభివృద్ధి చేస్తున్నారని ఆశ పడిన ప్రయాణికులకు చుక్కెదురైంది. రహదారిని కంకర, యాష్‌తో అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో బస్సులు, లారీల వెనుక దుమ్ము రేగుతుండడంతో ద్విచక్రవాహన దారులు ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ రహదారిని పూర్తి స్థాయిలో తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

### గంగానమ్మకు మంత్రి పూజలు

ముదినేపల్లి రూరల్: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గంగానమ్మకు ఆదివారం పూజలు చేశారు. మండలంలోని పేరూరులో గంగానమ్మ సంబరం జరిగింది. మంత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు.

### శ్రీ దుర్గాదేవికి భక్త నీరాజనం

గుడ్లవల్లేరు: మండలంలోని కూరాడ లాకుడిగువన శ్రీ కనక దుర్గాదేవి అమ్మవారి వార్షికోత్సవ సంబరాలు ఆదివారం కనులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చిత్ర విచిత్ర దేవతా వేష ధారణలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపును కొనసాగించారు. స్థానిక యువ కళాకారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారికి టెంకాయలు, పళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు రోడ్ల వెంబడి బారులు తీరారు. అమ్మవారి ప్రభను కనకడప్పుల వాయిద్యాలు, బాణాసంచాతో కూరాడ, గుడ్లవల్లేరులోని పుర వీధుల్లో ఊరేగించారు.

### పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ



కలిదిండి(కైకలూరు): స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలిదిండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1992–93 ఏడాది 10వ తరగతి పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమం చేశారు. కలిదిండి పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుల సమక్షంలో కేక్ కట్ చేసి ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, గుడ్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. కలిదిండి సర్పంచ్ లక్ష్మీప్రసన్న, పూర్వ విద్యార్థులు పాము వీర వెంకట రవికుమార్, మోటుపల్లి సోమేశ్వరావు, గోదావరి సుబ్రహ్మణ్యం, ఒడిగిన దుర్గాప్రసాద్, లలితా ప్రసాద్, ఆరోగ్య జీవరత్నం పాల్గొన్నారు.

### గుబురు మొక్కల తొలగింపు



ఆటపాక ప్రభుత్వ బాలికల హైస్కూల్ ప్రహరీ వద్ద మొక్కల తొలగింపును పర్యవేక్షిస్తున్న టౌన్ సీఐ, ఎస్ఐలు

కైకలూరు: ఆటపాక ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణ చుట్టూ గుబురుగా పిచ్చిమొక్కలు పెరగడంతో విష సర్పాల భయం నెలకొంది. ఇటీవల ఆటపాక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు పట్టణ సీఐ పి.కృష్ణ, ఎస్ఐ ఆర్.శ్రీనివాస్ వెళ్లారు. ఆ సమయంలో పాఠశాల ప్రహరీకి ఆనుకుని గుబురుగా ఉన్న చెట్లతో భయంగా గడుపుతున్నామని ఉపాధ్యాయులు, విద్యార్థులు చెప్పారు. దీంతో సీఐ, ఎస్ఐలు జేసీబీతో దగ్గరుండి వాటిని ఆదివారం తొలగింపజేశారు.

### అంకమ్మ తల్లికి పూజలు

పెనమలూరు: శ్రావణమాసం సందర్భంగా పెనమలూరు గ్రామంలో ఆదివారం నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆకునూరి వారి అంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యం సమర్పించారు. తెలుగు నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఆకునూరి సుబ్బారావు మాట్లాడుతూ పజలంతా సుఖసంతోషాలతో, రైతులు పాడిపంటలతో సంవృద్ధిగా ఉండాలని శ్రావణమాసంలో అమ్మ వారికి ప్రతి ఏటా పూజలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆకునూరు బసవరాజు, ఆకునూరు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, రమేష్, వి.మారుతి, తెన్నేటి ప్రకాష్, మద్దిరాల వెంకటసుబ్బారావు, పరస బాలకృష్ణ భక్తులు పాల్గొన్నారు.

## పెచ్చులూడుతున్నాయ్.. కాస్త పట్టించుకోండి!



పెచ్చులూడుతున్న ఎన్టీఆర్ కాలనీ ముఖద్వార ఆర్చ్

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ కాలనీ ముఖద్వారం ఆర్చి శిథిలావస్థకు చేరింది. తరుచూ పెచ్చులూడి కిందపడుతున్నాయి. ఎన్టీఆర్ కాలనీలో ట్రాఫిక్ ఎక్కువ. అధిక సంఖ్యలో ప్రజలు ఇటు నడుస్తుంటారు. ఇప్పటికే రెండు మూడు సార్లు పెచ్చులూడటంతో స్థానికులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఈ ఆర్చ్ నిర్మించి సుమారు 40 సంవత్సరాలు కావడంతో అది క్రమేపి శిథిలమై పెచ్చులు రాలుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్చ్‌కి మరమ్మతులు చేయడమో లేదా కొత్తది నిర్మించి ప్రజలకు హాని కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## కృష్ణానదిలో తగ్గుతున్న వరద



తోట్లవల్లూరు లంక నుంచి పడవలో పశువుల మేత తెచ్చుకుంటున్న రైతు

తోట్లవల్లూరు: కృష్ణానదిలో వరద క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటిని అధికారులు విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేస్తున్న విషయం విదితమే. సుమారు మూడు లక్షల క్యూసెక్కులపైగా నదికి వరద నీరు విడుదల చేయటంతో లంక గ్రామాల ప్రజలు, కరకట్ట వెంబడి గ్రామాల రైతులు ఆందోళనకు గురయ్యారు. రెండు రోజుల నుంచి క్రమంగా నదిలో వరద తీవ్రత తగ్గుముఖం పట్టడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు. నదిలో వరదనీటి నేపథ్యంలో లంకగ్రామాల ప్రజలు, లంకలకు వెళ్లే రైతులు, కూలీలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

## ఐదుగురు జూదరుల అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: గుట్టుచప్పుడు కాకుండా జూద శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వి.సురేష్ హెచ్చరించారు. స్థానిక తారకరామ కాలనీ సమీపంలోని పామాయిల్ తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం హనుమాన్‌జంక్షన్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.6,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట, కోడిపందేలు వంటి జూదాల నిర్వహణ చట్టరీత్యా నేరమని, వీటి నిర్వాహకులపై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు.





## పంటలు కళకళ!



తోట్లవల్లూరులో అంతర పంటగా సాగవుతున్న అరటిలో కంద



ఏపుగా ఎదుగుతున్న చెరకు



కంద పంట కళకళ

తోట్లవల్లూరు లంకల్లో పంటలు కళకళలాడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో లంక, మెట్ట, మాగాణి ప్రాంతాల్లో సాగవుతున్న కంద, అరటి, పసుపు, తమలపాకు, చెరకు, వరి ఏపుగా ఎదుగుతూ పచ్చగా పరిఢవిల్లుతున్నాయి. ఆయా పంటలకు రైతులు ఎరువులు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

– తోట్లవల్లూరు